www.jananinadam.com

Follow :

# జననినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం

తెలుగు దినపత్రిక

శుక్రవారం 06-11-2026

సంపుటి : 2 సంచిక : 179

ఆసిఫాబాద్ Asifabad

హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్

Editor: JADAV ROHIDAS

పేజీలు : 04

వెల: రూ.2.00

Simultaneously published from
, Asifabad, Karimnagar, Adilabad ,
www.jananinadam.com



## ఇరాన్ యుద్ధమే రి పబ్లికన్లను ముంచింది

**: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్**

**గతంలో మద్దతిచ్చిన ఓటర్లు డెమోక్రాట్లకు ఓటు వేయడం వల్లే ఓడామని విశ్లేషణ**

**యుద్ధ నిర్ణయాన్ని సమర్థించుకున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**

**సెనేట్, ప్రతినిధుల సభ రెండింటిలోనూ డెమోక్రాట్లకు ఆధిక్యం**

**రిపబ్లికన్ పార్టీలో ఓటమిపై మొదలైన అంతర్గత చర్చ**

**వాషింగ్టన్**

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధికార రిపబ్లికన్ పార్టీ ఓటమికి ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధమే ప్రధాన కారణమని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అభిప్రాయపడ్డారు. గతంలో డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతుగా నిలిచిన అనేకమంది ఓటర్లు ఈసారి డెమోక్రటిక్ పార్టీ వైపు మొగ్గు చూపారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలపై సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఆయన తన విశ్లేషణను సుదీర్ఘంగా పంచుకున్నారు. ఓటింగ్ శాతం తగ్గడం వల్ల తాము ఓడిపోలేదని, తమ మద్దతుదారులు ప్రత్యర్థి పార్టీకి ఓటు

2వపేజీలో...

## "కాంగ్రెస్ ఎంపీల సంఖ్య పెరగాలంటే ఇలా చేయాలి"

**రాహుల్‌కు కేంద్రమంత్రి 7 సలహాలు**

**విదేశీ పర్యటనలు తగ్గించి భారత్‌లో ఎక్కువ సమయం గడపాలని హితవు**

**సీనియర్లను గౌరవించాలని, భారత్ వ్యతిరేక వ్యక్తులకు దూరంగా ఉండాలని సూచన**

**పార్లమెంటు చర్చల్లో కాంగ్రెస్ ఎంపీలు పాల్గొనాలని సూచన**

**రాజ్యాంగ సంస్థలను గౌరవించి కుటుంబ రాజకీయాలకు ముగింపు పలకాలన్న మంత్రి**

**మోదీతో బహిరంగ చర్చకు రాహుల్ సవాల్ విసరడంతో ముదిరిన మాటల యుద్ధం**



2వపేజీలో...



2వ పేజీలో...

## 7, 8, 9 తేదీల్లో కొడంగల్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటన

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతో పాటు దాదాపు రూ. 9,100 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. పూర్తయిన భవనాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు.నవంబర్ 7వ తేదీ (శనివారం)ముఖ్యమంత్రి ఉదయం 11 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట చేరుకుని అక్కడ నిర్వహిస్తున్న మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తారు. రైతు మేళాలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు.అక్కడే ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిర్వహించే ముఖాముఖిలో పాల్గొంటారు. ఆ తర్వాత పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. అక్కడి నుంచి బయలుదేరి కొడంగల్ చేరుకుంటారు.

నవంబర్ 8వ తేదీ (ఆదివారం)ఉదయం హకీంపేట

## అమెరికాతో డీల్‌పై భారత్ ఆచితూచి అడుగులు..



2వ పేజీలో...

**కలిసిరానున్న ఎన్నికల ఫలితాలు!**

**అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై భారత్‌కు తగ్గిన తొందర**

**రిపబ్లికన్లకు పట్టు తగ్గడంతో సుంకాల విషయంలో కలిసి రావొచ్చని అంచనా**

**ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థకు సానుకూలమన్న ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్**

**ఇకపై అదనపు సుంకాలు విధించాలంటే సెక్షన్ 301, 232 కింద విచారణలు తప్పనిసరి**

**దీంతో భారత్‌కు అకస్మాత్తుగా సుంకాల షాక్ తగిలే ప్రమాదం తగ్గుతుందని అంచనా**

## నాతో చర్చకు వస్తే మోదీ దేశ ద్రోహి అని ఐదు నిమిషాల్లో నిరూపిస్తా ... రాహుల్‌గాంధీ

**: కేంద్రం ప్రభుత్వం పై, ప్రధాని నరేంద్రమోదీపై కాంగ్రెస్ అగ్రనేత**



రాహుల్‌గాంధీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ 'దేశద్రోహి' అని, ఆయనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని ఆరోపించారు. తనతో చర్చకువస్తే మోదీ దేశ ద్రోహి అనే ఆ విషయాన్ని ఐదు నిమిషాల్లో నిరూపిస్తానని అన్నారు. ఈ అంశంపై చర్చకు రావాలని ప్రధానికి సవాల్ విసిరితే పార్లమెంటులో చర్చిద్దామని ఎన్డీయే నేతలు అంటున్నారని చెప్పారు. కానీ లోక్‌సభలో తాను మాట్లాడకుండా మైక్ కట్ చేస్తారని విమర్శించారు. దేశంలో మాదకద్రవ్యాల

## పార్లమెంటుకు రండి చర్చిద్దాం.. రాహుల్‌కు అమిత్ షా సవాల్!

**పార్లమెంటులో చర్చకు రావాలని రాహుల్‌కు అమిత్ షా సవాల్**

**ఎస్ఐఆర్‌పై ప్రత్యేక సమావేశాలకు సిద్ధమని ప్రకటన**

**ఎస్ఐఆర్ జరగక ముందు కూడా ఎన్నికల్లో ఓడిపోయారంటూ విమర్శ**

**పార్లమెంటును అడ్డుకుంటున్నారని కాంగ్రెస్‌పై ఆరోపణ**

**రాహుల్ విదేశీ పర్యటనల వివరాలు వెల్లడించాలని డిమాండ్**



2వ పేజీలో...

ప్రధాని నరేంద్ర మోదీతో చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సవాల్ విసరడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. వీధుల్లో కాకుండా పార్లమెంటులో చర్చకు రావాలని సూచించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చించేందుకు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. హర్యానాలోని కర్నాల్‌లో గురువారం జరిగిన బహిరంగ సభలో అమిత్ షా మాట్లాడుతూ.. ప్రధాని మోదీతో చర్చ కావాలంటే ఆయనకు లేఖ

## 'ఆర్ఆర్ ట్యాక్స్' నిజమేఅయితే చర్యలేవి?

**మోదీ, షాలకు కేటీఆర్ ప్రశ్న**

**ఆర్ఆర్ ట్యాక్స్‌పై కేటీఆర్ మరోసారి విమర్శలు**

**చదరపు అడుగుకు రూ.200 వసూలు చేస్తున్నారని ఆరోపణ**

**బిల్డర్లు, డెవలపర్లకు విషయం తెలుసన్న కేటీఆర్**

**విమర్శలు చేస్తున్న కేంద్రం చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్న**



బీజేపీ-కాంగ్రెస్ మధ్య అవగాహన ఉందని ఆరోపణ తెలంగాణ రాజకీయాల్లో 'ఆర్ఆర్ ట్యాక్స్' వ్యవహారాన్ని మరోసారి తెరపైకి తెచ్చారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బీజేపీ అగ్రనేతలు.. ఆరోపణలు చేస్తున్నవారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలను ప్రశ్నించారు. హైదరాబాద్‌కు వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేయడం మినహా కేంద్రం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తన ఎక్స్ పోస్టులో కేటీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఏ బిల్డర్‌ను, డెవలపర్‌ను అడిగినా 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూళ్ల గురించి చెబుతారని పేర్కొన్నారు. చదరపు అడుగుకు రూ.200 చొప్పున వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు నిజం కాదా? అని ప్రశ్నించారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఈ విషయం అందరికీ తెలిసినప్పుడు కేంద్రంలోని బీజేపీ పెద్దలకు తెలియదా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ కలిసి 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని ప్రధాని మోదీ, అమిత్ షా ఆరోపిస్తున్నారని కేటీఆర్ అన్నారు. అలాంటప్పుడు ఆ వసూళ్లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని

## అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలి..

**రేవంత్ ప్రభుత్వానికి కవిత డిమాండ్**



**హైదరాబాద్, నవంబర్ 05:** ఖానామెట్‌లోని అయ్యప్ప సొసైటీలో సర్వే చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అందుకోసం రేవంత్ ప్రభుత్వానికి నెల రోజులు సమయం ఇస్తున్నామన్నారు. అయ్యప్ప సొసైటీలో ఇల్లు కొని ఎవరూ నష్టపోవద్దని ప్రజలకు సూచించారు. ఈ అయ్యప్ప సొసైటీలో రిజిస్ట్రేషన్లు ఉండవని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఈ సొసైటీలో 750 అక్రమ నిర్మాణాలు జరిగాయని వివరించారు. గురువారం హైదరాబాద్‌లో కల్వకుంట్ల కవిత విలేకర్లతో మాట్లాడుతూ.. అయ్యప్ప సొసైటీలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సొసైటీలోనే నారాయణ, చైతన్య విద్యా సంస్థలు ఉన్నాయని గుర్తు చేశారు. సర్వే నెంబర్ 11/18 నుంచి 11/44 వరకు అక్రమ నిర్మాణాలు జరిగాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులు దగ్గరుండి పర్మిషన్లు ఇప్పించి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. హైదరాబాద్ భూములు, టీడీఆర్ అక్రమ దందాలు తప్ప ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమి కనిపించటం లేదని వ్యంగ్యంగా అన్నారు. ఈ దందా ఆపించాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్పష్టం చేశారు. గురుకుల ట్రస్ట్ భూములపై అనేక ఉద్యమాలు చేశామని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ వచ్చి.. రాజకీయాలు తప్ప ఏం మాట్లాడలేదని అన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా చేస్తే.. అమిత్ షా హైదరాబాద్‌లో ర్యాలీ నిర్వహించారని వివరించారు. బీఆర్ఎస్ పార్టీపై మాట్లాడటం పని కొచ్చే అంశం కాదని టీఆర్ఎస్ చీఫ్ కవిత అభిప్రాయపడ్డారు.

## నాతో చర్చకు వస్తే మోదీ దేశ ద్రోహి అని ఐదు
# నిమిషాల్లో నిరూపిస్తా ... రాహుల్‌గాంధీ

మొదటిపేజీ తరువాయి...



నిర్మూలనకు షా మూడేళ్ల గడువు పెట్టారని, అయితే అప్పటికి ఆయన ఆ పదవిలో ఉంటారో లేదో..? అని ఎద్దేవా చేశారు. తన అంచనా ప్రకారం ఏడాదిలోపే ప్రభుత్వం కూలిపోతుందని కీలక వ్యాఖ్యలు చేశారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో బుధవారం జరిగిన ఇన్సాఫ్ ర్యాలీలో రాహుల్‌గాంధీ మాట్లాడారు. తాను అమిత్ షాను ఒక్కటే అడగాలనుకుంటున్నానని, అదానీ ఓడరేవులో పట్టుబడిన మాదకద్రవ్యాల సంగతేంటి..? ఆ విషయంలో మీరు తీసుకున్న చర్యలేమిటి..? అని ప్రశ్నించారు. మీరు పైకి శాంతిభద్రతల గురించి మాట్లాడుతున్నారని, కానీ మీరు గ్యాంగ్‌స్టర్లను ప్రోత్సహిస్తున్నారని దేశం మొత్తానికి తెలుసని అమిత్ షాను ఉద్దేశించి అన్నారు. ఒకవేళ అమిత్ షా శాంతిభద్రతల గురించి మాట్లాడాలనుకుంటే మణిపుర్‌లో ఏం జరుగుతుందో దేశానికి చెప్పాలని రాహుల్‌గాంధీ అన్నారు. పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆప్‌పైనా రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఆప్ అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రగ్స్ సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని భగవంత్ మాన్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, కానీ వారు ఎక్కడ నిర్మూలించారని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఏ ఒక్క ప్రాంతం నుంచైనా వారు డ్రగ్స్‌ను నిర్మూలించారా..అని నిలదీశారు. సమస్యను అంతంచేసే సామర్థ్యం వారికి లేదని రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. గతంలో లోక్‌సభలో భగవంత్ మాన్‌తో కలిసి కూర్చున్న సమయంలో ఆయన జోకులు వేసేవారని, ఆయన వద్ద మద్యం వాసన వచ్చేదని ఆరోపించారు. మాదక ద్రవ్యాలపై పోరాడలనుకుంటే ముఖ్యమంత్రి మద్యం మత్తులో ఉండకూడదని మాన్‌కు రాహుల్ చురకలంటించారు. సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సచిన్ పైలట్ కూడా పాల్గొన్నారు.

## “కాంగ్రెస్ ఎంపీల సంఖ్య పెరగాలంటే ఇలా చేయాలి”

మొదటిపేజీ తరువాయి...



**న్యూఢిల్లీ05:** లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ సవాల్ విసురుతుంటే.. కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తనదైన శైలిలో స్పందించారు. కాంగ్రెస్‌కు పార్లమెంటులో మరిన్ని స్థానాలు కావాలంటే రాహుల్‌గాంధీ ఏడు విషయాల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. తరచూ రహస్యంగా విదేశీ పర్యటనలకు వెళ్లడం మానుకోవాలని, సీనియర్లను గౌరవించాలని హితవు పలికారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రాహుల్‌గాంధీ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్లకుండా భారత్‌లో ఎక్కువ సమయం గడపాలని రిజిజు సూచించారు. సీనియర్ నేతలను గౌరవిస్తూ వారి అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవాలన్నారు. భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించే వ్యక్తులను కలవకూడదని, వారి ఎజెండాను ప్రోత్సహించకూడదని పేర్కొన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, ప్రధాని మోదీపై వ్యతిరేకత తగ్గించుకోవాలని సూచించారు. బీజేపీని రాజకీయ ప్రత్యర్థిగా చూడాలే తప్ప శత్రువుగా భావించకూడదన్నారు. పార్లమెంటు కార్యకలాపాలను మరింత సీరియస్‌గా తీసుకోవాలని, కాంగ్రెస్ ఎంపీలకు చర్చల్లో పాల్గొనే అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగబద్ధ సంస్థలను గౌరవించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలని, కుటుంబ రాజకీయాలకు ముగింపు పలకాలని ఏడో సూచనగా పేర్కొన్నారు. అంతకుముందు పార్లమెంటులో విపక్ష సభ్యులు వాకౌట్ చేసిన పాత వీడియోను రిజిజు ఎక్స్‌లో పంచుకున్నారు. చర్చలు, వాదోపవాదాల కోసమే పార్లమెంటు ఉందని పేర్కొన్నారు. చర్చల్లో పాల్గొనడానికి ఇష్టపడనివారే ఇప్పుడు బహిరంగ చర్చ గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ రాహుల్‌గాంధీ బుధవారం మరోసారి సవాల్ విసిరారు. ఐదు నిమిషాల్లోనే ప్రధాని దేశద్రోహి అని నిరూపిస్తానంటూ వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా స్పందించారు. అంతకుముందు కూడా ప్రతిపక్షాన్ని దేశ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరిస్తున్నారంటూ మోదీపై రాహుల్ విమర్శలు చేశారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.

## 7, 8, 9 తేదీల్లో కొడంగల్‌నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటన

మొదటిపేజీ తరువాయి...

చేరుకుని స్వయం సహాయక సంఘాల మహిళలతో జరిగే సమావేశంలో పాల్గొంటారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ. 81 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేస్తారు. రూ. 4 కోట్లతో నాట్కో సంస్థ సీఎస్ఆర్ వ్యయంతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను, రూ. 2.35 కోట్లతో నిర్మించిన హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. అనంతరం బొంరాస్‌పేటలో రూ. 4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను, రూ. 3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభిస్తారు. అలాగే, కొడంగల్‌లో రూ. 3.80 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయ భవనాలను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం తర్వాత దుద్యాలలో రూ. 3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనాన్ని, రూ. 12 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. కోస్గి మండలం నాచారం గ్రామంలో రూ. 5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు?2కు శంకుస్థాపన చేస్తారు. ఈ రహదారిని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వద్ద, జాతీయ రహదారి 167ఔ వరకు నిర్మించనున్నారు.కోస్గిలో రూ. 6 కోట్లతో నిర్మించిన సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభిస్తారు. దౌల్తాబాద్ మండలం బాలంపేటలో రూ. 2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. దౌల్తాబాద్‌లో రూ. 4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభిస్తారు. అనంతరం కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.

రూ. 9,053 కోట్లతో 13 అభివృద్ధి పనులు×ముఖ్యమంత్రి గారు మూడు రోజుల పర్యటన సందర్భంగా మొత్తం రూ. 9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, శిలాఫలకాల ఆవిష్కరణలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిలో కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ. 5,060 కోట్లతో రేడియల్ రోడ్డు -2, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ. 1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు, రూ. 2,100 కోట్లతో ఎంఎన్‌కేఎల్ఐఎస్ రెండో దశ పనులు ఉన్నాయి. విద్యా రంగంలో రూ. 118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ. 123 కోట్లతో కొడంగల్‌లో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సంబంధించిన పనులు ఉన్నాయి.రూ. 41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్టాండ్లు, రూ. 20 కోట్లతో మద్దూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఔంఅ) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ. 20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం, రూ. 59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి రూ. 4.45 కోట్లు, కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధికి రూ.5.10 కోట్లు కేటాయించారుహకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణం, రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నారు రూ. 46.08 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రభుత్వ భవనాలను ఈ పర్యటనలో ముఖ్యమంత్రి గారు ప్రారంభించనున్నారు. దుద్యాల సమీకృత మండల కార్యాలయ భవనం, కోస్గి సైన్స్ మ్యూజియం, హకీంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు, హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వీటిలో ఉన్నాయి. దుద్యాల, బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్లు, బొంరాస్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొడంగల్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం, దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ముఖ్యమంత్రి గారు ప్రారంభిస్తారు.

నవంబర్ 9వ తేదీ (సోమవారం)ముఖ్యమంత్రి కొడంగల్ నివాసం నుంచి హకీంపేటకు చేరుకుని అక్కడ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సభకు రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాల నుంచి దాదాపు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## అమెరికాతో డీల్‌పై భారత్ ఆచితూచి అడుగులు..



**న్యూఢిల్లీ 05:** అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలన్న భారత్ తొందర తగ్గిందని ఎంకే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తాజా నివేదిక వెల్లడించింది. అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు కాంగ్రెస్‌పై పూర్తి ఆధిపత్యం కోల్పోవడంతో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ కొంత తగ్గిందని విశ్లేషించింది. దీంతో భారత్‌పై సుంకాల విషయంలో ఆకస్మిక ఒత్తిళ్లు తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. ఈ పరిణామం భారత ఆర్థిక వ్యవస్థకు సానుకూలమని తెలిపింది. అమెరికా గతంలో ప్రకటించిన 18 శాతం సుంకాల విధానం అమల్లోకి రాలేదు. ప్రస్తుతం భారత వస్తువులపై 10 శాతం సెక్షన్ 301 సుంకం మాత్రమే అమలవుతోందని నివేదిక వివరించింది. అంతేకాకుండా, అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) ద్వారా ట్రంప్‌కు ఉన్న ఒత్తిడి తీసుకొచ్చే అవకాశం కూడా తగ్గిందని పేర్కొంది. ఇకపై అదనపు సుంకాలు విధించాలంటే సెక్షన్ 301, 232 కింద విచారణలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపింది. ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుంది. దీంతో భారత్‌కు అకస్మాత్తుగా సుంకాల షాక్ తగిలే ప్రమాదం తగ్గుతుందని అంచనా వేసింది. అయితే వాణిజ్య రంగంలో అనిశ్చితి మూర్తిగా తొలగిపోలేదని నివేదిక హెచ్చరించింది. ఫార్మా, ఎలక్ట్రానిక్స్ రంగాలపై సెక్షన్ 232 కింద అదనపు సుంకాలు విధించే ప్రమాదం ఉందని పేర్కొంది. రష్యా, ఇరాన్‌తో దౌత్య సంబంధాల్లో ప్రతికూల పరిణామాలు ఎదురైతే.. భారత్ చమురు దిగుమతులపై మళ్లీ ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని తెలిపింది. 2028 ఎన్నికలకు ముందు వినియోగదారులకు ధరల ఉపశమనం కల్పించాల్సిన రాజకీయ అవసరం ట్రంప్‌పై ఉంటుందని విశ్లేషించింది. మరోవైపు అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడం భారత్‌కు ఊరటనిస్తోంది. అక్టోబర్ 2026లో నమోదైన గరిష్ఠ స్థాయిలతో పోలిస్తే బ్రెంట్ క్రూడ్ ధర 19 శాతం తగ్గి బ్యారెల్‌కు 95 డాలర్లకు చేరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భారత్ చమురు దిగుమతుల బిల్లు 24 శాతం పెరిగింది. ఈ నేపథ్యంలో ధరల తగ్గుదల విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని తగ్గించనుంది. చమురు ధరలు తగ్గడం, డాలర్ బలహీనపడటం రూపాయి స్థిరత్వానికి దోహదపడతాయని నివేదిక పేర్కొంది. అయితే ఆర్బీఐ వద్ద 239 బిలియన్ డాలర్ల ఫార్వర్డ్ డాలర్ బాధ్యతలు ఉండటంతో రూపాయి మరింత బలపడటానికి పరిమితులు ఉండొచ్చని అంచనా వేసింది. మరోవైపు అమెరికాలో ద్రవ్యోల్బణం అధికంగానే కొనసాగితే వడ్డీ రేట్లు త్వరగా తగ్గకపోవచ్చని తెలిపింది. దీంతో ఆర్బీఐ అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుందని నివేదిక వివరించింది.

## పార్లమెంటుకు రండి చర్చిద్దాం..
# రాహుల్‌కు అమిత్ షా సవాల్!

మొదటిపేజీ తరువాయి...



రాయాలని రాహుల్‌కు సూచించారు. ఎస్ఐఆర్‌పై చర్చించేందుకు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామని, పార్లమెంటుకు వచ్చి తన వాదనలు వినిపించాలని సవాల్ విసిరారు. దేశ వ్యతిరేకులు ఎవరు? విదేశీ శక్తులతో సంబంధాలు ఎవరికి ఉన్నాయి? ఆ సంబంధాల స్వరూపం ఏంటి? అనే అంశాలపై ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు సిద్ధమంటూ రాహుల్ గాంధీ నవంబర్ 3న మరోసారి సవాల్ విసిరారు. ఎక్కడైనా, ఏ వేదికపైనైనా చర్చకు సిద్ధమని ఎక్స్‌లో పోస్టు చేశారు. మీడియా, దేశ యువత సమక్షంలో ఈ చర్చ జరగాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకించడాన్ని అమిత్ షా తప్పుబట్టారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎస్ఐఆర్ జరగలేదని, అయినా కాంగ్రెస్ ఓటమి పాలైందని వ్యాఖ్యానించారు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లోనూ ఎస్ఐఆర్ లేదని, అయినప్పటికీ కాంగ్రెస్‌కు ఓటమి తప్పలేదని అన్నారు. పార్లమెంటు సమావేశాలను సజావుగా సాగనివ్వకుండా.. బయట సభలు, ఆందోళనలతో గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. వీధుల్లో జనాన్ని సమీకరించి ఆందోళనలు కొనసాగిస్తే బీజేపీ కార్యకర్తలు తగిన సమాధానం చెబుతారని షా హెచ్చరించారు. దేశ ప్రజలు రాహుల్ గాంధీని, కాంగ్రెస్‌ను పదేపదే తిరస్కరిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో నిర్వహించిన సభకు దేశవ్యాప్తంగా 10 లక్షల మందిని పిలిచామని కాంగ్రెస్ చెప్పిందని, అయితే సభా ప్రాంగణం సామర్థ్యం 70 వేల మందేనని, అందులోనూ సగం ఖాళీగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ విదేశీ పర్యటనల వివరాలను కూడా ప్రజలకు వెల్లడించాలని అమిత్ షా డిమాండ్ చేశారు. ఆ వివరాలు తెలుసుకునే హక్కు దేశ ప్రజలకు ఉందని వ్యాఖ్యానించారు.

## కోకపేట పద్మశాలి భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు

### మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా నిధుల ఉత్తర్వుల అందజేత



**కరీంనగర్ నవంబర్ 05:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని కోకపేటలో రాష్ట్ర పద్మశాలి భవన నిర్మాణం కోసం రూ.5 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు మంజూరు చేసిన నిధుల ఉత్తర్వులను రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర పద్మశాలి సంఘం పెద్దలకు అందజేశారు.పద్మశాలి సామాజిక వర్గ అభివృద్ధి, సంక్షేమం, ఐక్యతకు రాష్ట్ర పద్మశాలి భవనం ఎంతో దోహదపడుతుందని సంఘం నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాష్ట్ర ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కామార్తాపు మురళి, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి రాజకీయ విభాగం అధ్యక్షుడు వాసాల రమేష్, కరీంనగర్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెతుకు సత్యం, కరీంనగర్ జిల్లా పద్మశాలి సంఘం సంక్షేమ ట్రస్ట్ అధ్యక్షుడు స్వర్గం మల్లేశం, జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు స్వర్గం నర్సయ్య, కొత్తపల్లి పట్టణ పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల చంద్రశేఖర్‌తో పాటు పలువురు పద్మశాలి కుల బాంధవులు పాల్గొన్నారు.

## ‘ఆర్ఆర్ ట్యాక్స్’ నిజమేఅయితే చర్యలేవి?

మొదటిపేజీ తరువాయి...



ప్రశ్నించారు. హైదరాబాద్‌కు తరచూ వస్తున్న మోదీ, అమిత్ షాలు ఈ అంశంపై బహిరంగంగా విమర్శలు చేయడం తప్ప, తదుపరి చర్యలు తీసుకోవడం లేదని వ్యాఖ్యానించారు.ఆర్ఆర్ ట్యాక్స్ వ్యవహారంలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య అంతర్గత అవగాహన ఉందని కేటీఆర్ ఆరోపించారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై చర్యలకు ముందుకు రావడం లేదని విమర్శించారు. ఆరోపణలు చేయడం, రాజకీయంగా విమర్శలు గుప్పించడం తప్ప ఆ వసూళ్లపై విచారణ జరిపించేందుకు బీజేపీ నేతలు చొరవ చూపడం లేదని అన్నారు. ‘ఆర్ఆర్ ట్యాక్స్’ అంశంపై ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఈ ఆరోపణలను తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం ఖండించింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఈ అంశం రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. అయితే చదరపు అడుగుకు రూ. 200 వసూలు చేస్తున్నారన్న కేటీఆర్ ఆరోపణపై స్వతంత్రంగా నిర్ధారితమైన ఆధారాలు ఈ కథనంలో ప్రస్తావించలేదు.

## ఇరాన్ యుద్ధమే రిపబ్లికన్లను ముంచింది

### : అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్

మొదటిపేజీ తరువాయి...

వేయడమే అసలు సమస్య అని వాన్స్ స్పష్టం చేశారు. ఇరాన్ యుద్ధాన్ని ముగించాలని, పెరుగుతున్న జీవన వ్యయం, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలని ఓటర్లు బలంగా కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా ప్రయోజనాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడం, ఇజ్రాయెల్‌తో సంబంధాలపై పునఃసమీక్ష వంటి అంశాలు కూడా ఓటర్ల తీర్పును ప్రభావితం చేశాయని వివరించారు. యుద్ధం కారణంగానే తాము పరాజయం పాలయ్యామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైతం అంగీకరించారని వాన్స్ పేర్కొన్నారు. అయితే, ఈ వాదనతో ట్రంప్ పాక్షికంగానే ఏకీభవించడం గమనార్హం. ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించడానికి సైనిక చర్య తప్పనిసరి అయిందని, మళ్లీ అలాంటి పరిస్థితి ఎదురైనా ఇదే నిర్ణయం తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు. తాజా ఎన్నికల ఫలితాల ప్రకారం, ప్రతినిధుల సభతో పాటు సెనేట్‌లోనూ డెమోక్రటిక్ పార్టీ ఆధిక్యం సాధించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీలో ఓటమికి గల కారణాలపై ప్రస్తుతం అంతర్గత చర్చ తీవ్రస్థాయిలో మొదలైంది.

# విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 05:** ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో నూతనంగా నిర్మించిన వంటగది, భోజనశాల వరిశీలించి, విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికాహారం తో పాటు నాణ్యమైన విద్యా బోధన అందించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎం.పి.సి. విద్యార్థినులకు గణితంలో అందిస్తున్న బోధన, వారి అభ్యసన స్థాయిని పరిశీలించి పలు సూచనలు చేశారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, అధికారులతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ భూముల పరిరక్షణ అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని, ఆక్రమణలు గుర్తించినట్లయితే వెంటనే స్పందించి నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.పట్టణంలోని కృష్ణా మందిర్ రోడ్డు నం.2 లో ధనలక్ష్మి ట్రేడర్ వారు ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, మండల తహసిల్దార్ కృష్ణ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 430 రూపాయలు, స్టీమ్ రైస్ ను 1 వేయి 560 రూపాయలు, హెచ్.ఎం.టి. స్టీమ్ రకం బియ్యం బస్తా 1 వేయి 898 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయించాలని నిర్వాహకులకు సూచించారు. జిల్లాలోని మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, భీమారం, లిలక్షెట్టిపేట్‌లి ప్రాంతాలలో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మార్కెట్ ధరలతో పాటు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కటే తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు విద్యుత్, త్రాగునీరు, సాగునీటి వినియోగంలో పొదుపు పాటించాలని తెలిపారు. రైతులు తక్కువ నీటి అవసరం ఉన్న జొన్న, మొక్కజొన్న, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు దృష్టి సారించాలని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలలో నీటి వృథాను అరికట్టాలని, విద్యుత్ ను పొదుపుగా వినియోగించాలని, అవసరం లేని సమయంలో ఫ్యాన్లు, లైట్లు ఆపివేయాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 11 మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించడం జరిగిందని, నేలను తేమ శాతం, పంటలపై ప్రభావం, లోటు వర్షపాతం అంశాలను ప్రామాణికంగా తీసుకొని శాస్త్రీయంగా అంచనా వేయడం జరిగిందని తెలిపారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. తాండూర్ మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ తో కలిసి సందర్శించి ప్రభుత్వ భూముల పరిరక్షణపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించినట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆక్రమణదారులకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయాలని, ప్రభుత్వ భూములను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూభారతి దరఖాస్తులను రికార్డులతో సరిచూసి క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తాండూర్ నాయబ్ తహసీల్దార్ కల్పన, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## లీ సర్వే పనులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ,
# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 05:** జిల్లాలో కొనసాగుతున్న రీ సర్వే పనులు, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ, ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని మందమర్రి మండలంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో నిర్దేశించిన పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. మందమర్రి మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, కార్యాలయ పనులపై సమీక్ష నిర్వహించారు. జి.ఓ. ఎం.ఎస్. నం. 76, 59, 58 క్రింద చేపడుతున్న భూముల క్రమబద్ధీకరణ పనుల పురోగతి, ఎస్ఐఆర్ ప్రక్రియని వరిశీలించి వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ భారతి దరఖాస్తులు, మీ-సేవ ద్వారా జారీ చేయవలసిన పెండింగ్ ధ్రువపత్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ దరఖాస్తుదారులకు నిర్ణీత సమయంలోగా జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సతీష్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్యసేవలో ఆటంకాలు లేకుండా సేవలు అందించాలి

**: డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 05:** జాతీయ ఆరోగ్య మిషన్ ఎన్‌హెచ్‌ఎం ఎం వైద్య సిబ్బంది ధర్నాలో ఉన్నందున వైద్య సేవలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మంచిర్యాల జిల్లా డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ఆదేశించారు. తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జాతీయ టీకాల కార్యక్రమంలో భాగంగా అందుబాటులో ఉన్న ఆరోగ్య కార్యకర్తలు సిబ్బందితో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా వ్యాధిగ్రస్తులను గుర్తించడం, నమోదు చేయడం, నిశ్చయ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్టులను అందజేయాలన్నారు. మాతా శిశు సంరక్షణ, గర్భవతుల నమోదు, ఆసుపత్రిలో ప్రసవాలు, అమ్మఒడి అంబులెన్స్ నర్వీన్ లను ఉపయోగించుకొనుట, కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా లాంటివి ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ సర్పంచులు, సిబ్బంది పరిశుభ్రతపై, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలోజిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, వైద్యాధికారి డాక్టర్ ఝాన్సీ, సీహెచ్వో జయమేరీ, పర్యవేక్షకులు రమాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పెండింగ్ సర్వే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 05:** పెండింగ్ సర్వే దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్ పాండే, సబ్ కలెక్టర్ కార్యాలయం ఎ.ఓ., అన్ని మండలాల తహసిల్దార్లు, అధికారులు, సంబంధిత సెక్షన్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న సర్వే దరఖాస్తులు, సర్వే పనుల పురోగతి, జి.ఓ. నం. 76, 59 అమలు తీరు, ఎస్ఐఆర్ ప్రక్రియ, భూ భారతి, భూదాన్ భూములకు సంబంధించిన ఫైళ్లు, కోర్టు కేసులపై సమీక్షించారు. ఆయా అంశాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ప్రతి పనిని పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన సమయంలోగా అన్ని పనులు పూర్తి చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ వరం...

**ఉచిత వైద్య సేవలతో ఎంతోమందికి ప్రయోజనం..**

**-- అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**




**జననినాదం,కాగజ్‌నగర్/ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 05:** గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించడంలో లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ చేస్తున్న సేవలు అభినందనీయమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్, భారతీయ రైల్వే సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచంలోనే తొలి హాస్పిటల్ రైలు లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ద్వారా ప్రజలకు అందించిన ఉచిత వైద్య సేవలు ఎంతో ప్రయోజనకరంగా నిలిచాయని పేర్కొన్నారు. గురువారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ వైద్య శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిబిరం ద్వారా నిరుపేదలకు ఉచిత శస్త్రచికిత్సలతో పాటు కంటి పరీక్షలు, చెవి, ముక్కు, గొంతు సంబంధిత వైద్య సేవలు, ప్లాస్టిక్ సర్జరీలు అందించడం అభినందనీయమన్నారు. ఆర్థిక స్థోమత లేని పేదలకు ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడంలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, రైల్వే అధికారులు సమన్వయంతో పనిచేయడం ప్రశంసనీయమన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా శ్రేయస్సులో భాగంగా బియ్యం ధరల నియంత్రణ



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 05:** ప్రజా శ్రేయస్సులో భాగంగా ప్రభుత్వం బియ్యం ధరల నియంత్రణ చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో సమత రైస్ డిపో వారు ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్ లెట్ ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, మండల తహసిల్దార్ వనజ రెడ్డి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట ధరలకు మించి అమ్మకాలు జరుపకూడదని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్ నినో ప్రభావం వల్ల ప్రస్తుతం మార్కెట్ లో నెలకొని ఉన్న పరిస్థితుల నేపథ్యంలో బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు అందరూ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలకు బియ్యం ధరలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ నిర్ణీత ధరకే విక్రయాలు జరిగేలా రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని, తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని తెలిపారు. 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బి.పి.టి. న్యూ రైస్ బ్యాగ్ ను 1 వేయి 352 రూపాయలు, స్టీమ్ రైస్ ను 1 వేయి 482 రూపాయలు, పాత బియ్యం 1 వేయి 638, హెచ్.ఎం.టి. పాత రకం బియ్యం బస్తా 1 వేయి 950 రూపాయలు, జై శ్రీరామ్ పాత బియ్యం 1 వేయి 976 రూపాయల చొప్పున అవుట్ లెట్ ద్వారా నిబంధనల ప్రకారం విక్రయాలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ద్వారా ప్రతి నెలా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 05:** భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం హైస్కూల్, కళాశాల విద్యార్థులకు ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో శుద్ధమైన ఓటరు జాబితా ప్రాముఖ్యత, ఓటు వేయడం యొక్క ప్రాముఖ్యత అనే అంశాలపై ప్రతి నెలా వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. హరిత అన్నారు.గురువారం సమీకృత కలెక్టర్ భవన సముదాయంలోని మీడియా కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, అదనపు కలెక్టర్ లోకేశ్వర్ రావుతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం 9, 10 తరగతి విద్యార్థులు, ఆపై ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు ప్రతి నెలా ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఆధ్వర్యంలో శుద్ధమైన ఓటరు జాబితా ప్రాముఖ్యత, ఓటు వేయడం యొక్క ప్రాముఖ్యత అనే రెండు అంశాలపై వ్యాసరచన, 50 ప్రశ్నలతో కూడిన క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పాఠశాల, కళాశాల నుండి ఇద్దరు విద్యార్థులను నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేసి, అందులో నుండి పది మంది విద్యార్థులను జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీలకు ఎంపిక చేసి వారికి సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి నెలా నిర్వహించడానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.

# మీసేవ కేంద్రాలపై అధికారుల ఆకస్మిక తనిఖీలు

**జననినాదం,తాండూర్ 05:** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం లోని మీసేవ కేంద్రాలను జిల్లా అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో నిర్వహిస్తున్న రికార్డులను క్షుణ్ణంగా వరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలు, దరఖాస్తుల పరిష్కార విధానం, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం మీసేవ కేంద్రాలు పనిచేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని అధికారులు సూచించారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

### అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి
### సర్పంచ్ పెందోర్ ఆనందరావు



**జననినాదం,కెరమెరి,సిర్పూర్(యు),నవంబరు 05:** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కెరమెరి గ్రామ సర్పంచ్ పెందోర్ ఆనందరావు సూచించారు. గురువారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన రేషన్ స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలతో పాటు నాణ్యమైన నిత్యావసర సరుకులు నేరుగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అత్యాధునిక క్యూఆర్ కోడ్‌తో కూడిన వాటర్‌ప్రూఫ్ స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి ఇర్ఫాన్, గ్రామ పాలన అధికారి విశ్వాస్, వార్డు సభ్యులు ఆత్రం రాజు, గేడం మాన్కు, బాంనే శ్రీకాంత్, సుభద్ర, ఫరీద్, మంజుల, రెవెన్యూ సిబ్బంది రాజుతో పాటు పలువురు పాల్గొన్నారు

## గుస్సాడి కళాకారులకు అగర్వాడ గ్రామ

### సర్పంచ్ వడ్గూరే రోజా సోనాజీ ఆర్థిక చేయూత



**జననినాదం,కెరమెరి,సిర్పూర్(యు),నవంబరు 05:** ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే గుస్సాడి కళను ప్రోత్సహించడంతో పాటు, కళాకారులను ఆదుకునేందుకు అగర్వాడ గ్రామ పంచాయతీ ముందడుగు వేసింది. గ్రామ సర్పంచ్ రోజా సోనాజీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో గుస్సాడి దండారి కార్యక్రమం గ్రామ పంచాయతీ తరఫున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రోజా మాట్లాడుతూ.. ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే గుస్సాడి కళను భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న ఇటువంటి కళలను ప్రోత్సహించడంతో పాటు కళాకారులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి డి.ఏ.వి హైస్కూల్‌కు రాష్ట్రస్థాయి ఖ్యాతి

### కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యాధునిక వసతులు.. ఇతర విద్యాలయాలకు ఆదర్శంగా నిలిచిన భద్రాద్రి డి.ఏ.వి



**భద్రాద్రి కొత్తగూడెం,నవంబర్: 0**5: తెలంగాణ జెన్‌కో పరిధిలోని వివిధ డి.ఏ.వి విద్యాలయాలకు చెందిన ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయుల బృందం బుధవారం భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ టౌన్‌షిప్‌లోని డి.ఏ.వి హైస్కూల్‌ను సందర్శించింది. పాఠశాలలో కల్పించిన అత్యాధునిక మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలను పరిశీలించిన బృందం సభ్యులు పాఠశాల అభివృద్ధిపై ప్రశంసల వర్షం కురిపించారు. చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న సారథ్యంలో, ఎస్.ఈ (సివిల్), ఎస్.ఈ (అడ్మిన్) అధికారుల పర్యవేక్షణలో నిర్మించిన అత్యాధునిక పాఠశాల భవనం, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, విశాలమైన క్రీడా ప్రాంగణం, పార్కింగ్ సదుపాయాలను బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశస్థాయిలోని ప్రముఖ కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని రీతిలో భద్రాద్రి డి.ఏ.వి హైస్కూల్‌లో మౌలిక సదుపాయాలు, బోధనా విధానాలు ఉండటం అభినందనీయమని పేర్కొన్నారు. ఇక్కడి విద్యా వాతావరణం, సదుపాయాలు ఇతర డి.ఏ.వి విద్యాలయాలకు ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ఈ సిలబస్ అమలులోకి రానున్న నేపథ్యంలో భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యను అందిపుచ్చుకునే గొప్ప అవకాశం లభించనుందని, ఉద్యోగుల పిల్లలు అదృష్టవంతులని అభిప్రాయపడ్డారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేసిన చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న ని బృంద సభ్యులు ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యారంగ అభివృద్ధికి అధికారుల సహకారం, దూరదృష్టి ఎంతగానో దోహదపడతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల భద్రతకు పటిష్టమైన ఏర్పాట్లు - ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిరంతర పర్యవేక్షణ

కరీంనగర్ నవంబర్ 05: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదామును గురువారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ వ్యవస్థ, సిబ్బంది విధుల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గోదాములను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తూ నివేదికలు పంపిస్తున్నట్లు తెలిపారు. భద్రతా విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా పోలీస్ గార్డులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రతినిధి నత్తినేని శ్రీనివాస్, బీజేపీ ప్రతినిధి నాంపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ ప్రతినిధి పడిశెట్టి భూమయ్య, టీడీపీ ప్రతినిధి ఎర్రబెల్లి రవీందర్, ఎంఐఎం ప్రతినిధి బర్కత్ అలీ, కరీంనగర్ తాసిల్దార్ ఎం. రాజేష్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## 15 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి..

### మిగతా 10 మండలాలను విస్మరించడం సరికాదు..
### సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్




**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 05:** ఆసిఫాబాద్ జిల్లాలోని మొత్తం 15 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి రైతులు, పేద ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా ఇన్‌చార్జి కామ్రేడ్ భూపాల్ డిమాండ్ చేశారు. జిల్లాలో కేవలం ఐదు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ఎంపిక చేయడం సరికాదని, మిగతా వది మండలాలను కూడా కరువు మండలాల జాబితాలో చేర్చాలని కోరారు. గురువారం ఆసిఫాబాద్‌లోని సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాల్ మాట్లాడుతూ.. జిల్లాలో నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్వింటాల్ బియ్యం ధర రూ. 10 వేలకు పైగా పలుకుతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడతాయనే అంచనాల నేపథ్యంలో వ్యాపారులు ముందస్తుగానే పంటలను గోదాముల్లో నిల్వచేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు. అధిక లాభాల కోసం పేద ప్రజలను దోచుకునే ప్రయత్నాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఉపాధి హామీ కూలీల సమస్యలపై హైదరాబాద్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

### తాండూర్‌లో కరపత్రాలు విడుదల చేసిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



**తాండూర్,05:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు సంవత్సరానికి 200 రోజుల పని కల్పించాలని, రోజువారీ వేతనం రూ.800 చెల్లించాలని, మేటీలకు కనీస వేతనం నిర్ణయించి, ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 6న హైదరాబాద్‌లోని కమిషనరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ హమాలీ కార్యాలయం వద్ద ధర్నాకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, వ్యవసాయ కార్మిక సంఘం తాండూర్ మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలు, నగర పంచాయతీల విస్తరణ పేరుతో గ్రామాలను విలీనం చేయడం వల్ల ఆయా ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు నిలిచిపోయి పేద కూలీలు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న కూలీల వేతనాలను వెంటనే చెల్లించాలని, కరువు మండలాలుగా ప్రకటించి పనులు కల్పించి వలసలను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. నవంబర్ 6న హైదరాబాద్‌లో జరిగే ధర్నాలో కూలీలు, సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తన్నీరు శ్రీను, కామెరా బాపు, మేడి ఎల్లయ్య, ఓడ్నాల చందు, ధరణి బుచ్చయ్య, చదువుల రవీందర్, ఎం. చందు, పెరుగు చందు, తనివేని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఈ - హెచ్.ఆర్.ఎం.ఎస్. పోర్టల్ ద్వారా ఉద్యోగులకు ఆర్థిక సేవలు సులభతరం - జిల్లా కలెక్టర్ కె. హరిత

**జననినాదం,ఆసిఫాబాద్‌జిల్లా ప్రతినిధి నవంబరు 05:** రాష్ట్ర ఆర్థిక శాఖ నూతనంగా ప్రవేశపెట్టిన ఈ - హెచ్.ఆర్.ఎం.ఎస్., ఈ - సాంక్షన్ పోర్టల్ ద్వారా ఉద్యోగులకు ఆర్థిక సేవలు సులభతరం అవుతాయని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మండల స్థాయి డి.డి.ఓ.లకు నిర్వహించిన రెండవ రోజు శిక్షణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ, జిల్లా ఖజానా శాఖ ఆధ్వర్యంలో నూతనంగా అభివృద్ధి చేసిన ఈ - హెచ్.ఆర్.ఎం.ఎస్., ఈ - సాంక్షన్ పోర్టల్ ద్వారా ఉద్యోగులకు అందే ఆర్థిక సేవలు సులభంగా, పారదర్శకంగా అందుతాయని తెలిపారు. ఉద్యోగులు, డి.డి.ఓ.లు పోర్టల్ వినియోగంపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉద్యోగుల సెలవులు, వేతనాలు, ఇతర ఆర్థిక సేవలు వంటి సేవలను శిక్షణలో నేర్చుకున్న అంశాల ద్వారా సులభంగా పొందవచ్చని తెలిపారు. రానున్న రోజుల్లో ఈ పోర్టల్ ద్వారా ఆర్థిక సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ అధికారి, మండల స్థాయి డి.డి.ఓ.లు పాల్గొన్నారు.

## తాగేందుకు నీళ్లు లేవు..

### బాత్రూంకూ బయటకే వెళ్లాల్సిన దుస్థితి..
### బషీరాబాద్ ఎస్సీ హాస్టల్‌లో నీటి కష్టాలు



**వికారాబాద్ 05:** బషీరాబాద్ ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. కనీసం తాగడానికి కూడా నీళ్లు అందుబాటులో లేవని, బాత్రూంకు వెళ్లేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్‌లో నీటి సదుపాయం లేకపోవడంతో ఎదురుగా ఉన్న పోలీస్ స్టేషన్, పక్కనే ఉన్న ఎంఆర్సీ భవనం నుంచి నీటిని తెచ్చుకొని కాలకృత్యాలు తీర్చుకుంటున్నట్లు చెబుతున్నారు. విద్యార్థుల కథనం ప్రకారం.. హాస్టల్‌లోని బోరు ఏడాది క్రితమే పాడైపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు దానికి మరమ్మతులు చేయించలేదు. మరోవైపు మిషన్ భగీరథ కనెక్షన్ ఉన్నప్పటికీ నీటి సరఫరా జరగడం లేదని వారు వాపోతున్నారు. బోరు మరమ్మతుల కోసం కలెక్టర్ నిధులు విడుదల చేసినప్పటికీ పనులు చేపట్టడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. తాగునీరు, కనీస అవసరాలకు కూడా నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బోరుకు మరమ్మతులు చేయించి, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా పునరుద్ధరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

## రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ సర్కార్



కమాన్ పూర్, నవంబర్05: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది అని బి ఆర్ ఎస్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తాటికొండ శంకర్ అన్నారు. గురువారం వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఎంపీడీవో మరియు తహసిల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. కమాన్ పూర్ మండల పరిధిలో వరి పంటలు కోతల సమయం వచ్చినప్పటికి దాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గురువారం బీఆర్ఎస్ నాయకులు ర్యాలీగా ప్రభుత్వ మండల ప్రజా పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలకు చేరుకుని త్వరితగతిన వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్పాటు చేసి రైతుల విక్రయ ఇబ్బందులు తొలిగించాలని కోరుతూ.. తహసీల్దార్ వాసంతికీ, ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. మండలంలో వరి కోతలు జరుగుతున్నప్పటికి కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దాన్యం విక్రయించడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మధ్య దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోయే పరిస్థితి నెలకుందన్నారు. ప్రక్కన పెద్దపల్లి నియోజకవర్గంలో గత వారం రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినప్పటికి మంత్రి శ్రీధర్ బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న మంథని నియోజకవర్గంలోని కమాన్ పూర్ మండలంలో ఇప్పటికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా మండలం పరిధిలో సెర్ఫ్, పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని లేని యెడల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేయట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, కొండ వెంకటేష్, చిందం తిరుపతి, రాచకొండ రవి, నీలం శ్రీనివాస్, జాబు సతీష్, , రాచకొండ చంద్రమౌళి, పెండ్లి నారాయణ, పొట్ల సతీష్, కొయ్యడ సంపత్, పంతకాని రవి, నడిగొట్టు సంపత్, పొట్ల శంకర్, కొండిల్ల ఓదెలు, గుర్రం శంకర్, ఒడ్నాల సతీష్, షేక్ మొహినుద్దీన్, దండే రమేష్ తాగూర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## భూముల ఆ సర్వే ను పకడ్బందీగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 05:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. లిగురువారంలి జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. శ్రీనివాస్ లతో కలిసి సర్వేయర్లకు జి.ఎన్.ఎస్.ఎస్. రోవర్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, సంబంధిత రైతులకు ముందుగా సమాచారం అందించి, ప్రతి రైతు రీ సర్వేలో హాజరయ్యే విధంగా టామ్ టామ్ ద్వారా తెలియజేయాలని తెలిపారు. రీ సర్వే ద్వారా భవిష్యత్తులో భూ సమస్యలు ఉండవని తెలిపారు. ప్రక్రియ నిర్వహణ కొరకు సర్వేలో వినియోగించే 12 రోవర్లను అందించడం జరిగిందని, వీటి ద్వారా ఖచ్చితమైన సర్వేను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్, డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు





**జననినాదం,మంచిర్యాల ప్రతినిధి నవంబరు 05:** ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్, డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో హెచ్ ఓ ఓ లు, డి డి ఓ లు, మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యతనిస్తూ ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్ ద్వారా అన్ని బిల్లుల సమర్పణ డిజిటల్ విధానంలో కొనసాగుతుందని, 2027 జనవరి 1వ తేదీ నుంచి మాన్యువల్ విధానానికి పూర్తిగా స్వస్తి పలికి, ప్రభుత్వ కార్యకలాపాలను డిజిటల్ విధానంలోనే నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీలోగా ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్లలో చేయవలసిన అన్ని వివరాల నమోదు, అప్‌డేషన్లను పూర్తి చేయాలని సూచించారు. జనవరి 1వ తేదీ నుంచి ఎంప్లాయీ సర్వీస్ రిజిస్టర్ పూర్తిస్థాయిలో అమలులోకి వస్తుందని తెలిపారు. నూతన డిజిటల్ విధానాలపై ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. శిక్షణలో భాగంగా ఈ.ఎస్.ఆర్. లో ఉద్యోగుల వివరాల నమోదు, నియామకాలు, పోస్టింగులు, సెలవుల దరఖాస్తు, సెలవుల రద్దు తదితర అంశాలను ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ ఆర్ ఎస్ లో ఒకసారి నమోదు చేసిన వివరాలను తిరిగి ఎడిట్ / డిలీట్ చేసే అవకాశం లేనందున, వివరాల నమోదు, ఆమోదం సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. సందేహాలను శిక్షణలోనే నివృత్తి చేసుకోవాలని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293. **Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197